# పిల్లి మెళ్ళో గంట

ఎలుకలు సభతీర్చాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎన్ని కావాలంటే అన్ని ఎలకల్ని చంపి తినేస్తున్న పిల్లిని ఏం చేయాలని చర్చ జరుగుతున్నది.

ఆకలి తీరటంకోసం ఏదో ఒకటి రెండెలుకల్ని చంపి తింటే అర్థముంది దాని సరదాక్కూడా చంపడం బాగాలేదు.

వంతులవారీగా ఇంటి కొక్కరు మేతగా వెళ్ళాలి అన్నారు పెద్దలు.

ఎలుకల్నే తినాలనేంటి? కప్పల్ని, పిట్టల్నిపట్టి తినచ్చుగా అన్నాయి కొన్ని.

అసలు పిల్లికి పెత్తనమేమిటి? పీక్లే దన్నాయి మరికొన్ని.

సరేనయ్యా ఏంచేద్దాం? పిల్లికి కనిపించకుండా దాక్కుందాం. పారిపోతాం. ఎన్నాళ్ళిలా?

పిల్లి చప్పుడుకాకుండా చటుక్కున వచ్చి పీకేస్తుంది. ఎలా తెలుస్తుంది దానిరాక?

దాని మెడలో ఓ గంటకడితే అది వచ్చేటపుడు ముందే తెలుసుకుని పారిపోవచ్చు.

బాగుంది బాగుంది శభాష్ అని చప్పట్లు కొట్టారందరూ.

సరే గంట ఎవరు కడతారో ముందుకిరండి. ఒక్కటికూడా రాలేదు.

ముఖముఖాలు చూసుకున్నాయి తప్ప ముందుకొకటీ రాలేదు.

ఔనుమరి గంటకట్టేలోగా గుటుక్కున మింగేయదూ పిల్లి?



ఇంతలో - ఓ కుర్ర ఎలక లేచింది. గంటకడతాం, ఆ చప్పుడు విని దాక్కుంటాం. ఇలా ఎన్నాళ్ళు? నిజమే నిజమే. ఎన్నాళ్ళు అని గోలచేశాయి కుర్ర ఎలకలు.

మరేం-చేయాలి తరతరాలుగా పిల్లికి జన్మహక్కు ఎలుకల్ని తినడం. ఆ రోజులు పోయాయి. ఇక సాగవు చెలగాటాలు- పదండిముందుకు ఐక మత్యమే మహాబలం గంటకట్టడంకాదు గుంటలు తవ్వుదాం- పిల్లినే మట్టు పెడదాం శాశ్వతంగా విముక్తి సాదిద్దాం. పిల్లీ డౌన్ డౌన్ అన్యాయాలకిది అంతం. మాపిల్లా పాపలకి రక్షణకావాలి. బోలో ప్రాణరక్షణ- జిందాబాద్ జిందాబాద్.

పిల్లి మెడలో గంట కట్టడంకాదు. ప్రస్తుతం మనం చేయాల్సింది పిల్లిని గుంటలో పెట్టడం అవసరం. సోదరులారా! రండి. ఎం చేయాలి? పిల్లి దూర గలిగేంత కన్నాలు తవ్వండి పైన పల్చగా మట్టిపరచండి. లోపలుండి కవ్వించండి. రెండ్రోజులు బైటకి రాకండి. ఆకలితో నకనకలాడే పిల్లి వెతుక్కుంటూ కన్నాలలోకి చూడబోయి జారి లోపల పడుతుంది. వెంటనే కుప్పలకొద్దీ మట్టి మీదకి తోసి సజీవ సమాధి చేద్దాం.

ఔను! చేద్దాం చంపేద్దాం భలేభలే. విప్లవం వర్ధిల్లాలి! సభ వెనుకగా పొంచివున్న పిల్లి ముసిముసి నవ్వులతో అటుక్కున గుంపులోదూకి వాటంగా వున్న నాల్గు దోర ఎలుకల్ని చీల్చేసింది. కార్యసాధనకి అప్రమత్తత ప్రధానం అని స్వానుభవంతో గ్రహించిన మిగిలిన ఎలుకలు రోషంతో మరింత పట్టుదలగా ప్రయత్నాలు సాగించాయి. ఓరోజు సాధిస్తాయి, పిల్లిని పడతాయి. ఈరోజు ఓడినా రేపు గెలుపు తప్పదు.

- స్నేహలత

---

[నలభై ఏళ్ళు పూర్తయినవి "స్వేచ్ఛాభారతి"కి. మన జన్మభూమిని, కన్నతల్లిని దాస్యవిముక్తను చేయడానికి ఎన్నివేలమంది కృషిచేశారో, బలై పోయారో, త్యాగం చేశారో ఆ పరమసత్యం నిత్యకళ్యాణంలా మన మనసులో వెలుగుతూనే వుండాలి. త్యాగమూర్తులు ఆశించిన "బానిసత్వం" తప్పిందిగాని, కోరుకున్న మానవకళ్యాణం జరగలేదు. తాతల పేరుతో వారసత్వం సాగుతున్నది!

త్వరలో "స్వేచ్ఛాభారతి" అనామిక ప్రత్యేక స్వాతంత్ర్య సంచిక ప్రచురిస్తున్నాం.

—ఎడిటర్